ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 24 డిసెంబరు 2024

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కక్షపూరితంగా నిర్మాణాన్ని ఆలస్యం చేశారు
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

7



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మత్తులో ముంచేసి..

నిబంధనలు పాటించని బార్ అండ్ రెస్టారెంట్లు



- జోరుగా నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలు
- కనీస ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మందుబాబులు మోసానికి గురవుతున్నారు. మద్యం మత్తులో ఉండటాన్ని ఆసరా చేసుకొని జిల్లాలోని కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు నాసిరకం ఆహార పదార్థాలు అంటగడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పర్యవేక్షించే వారు, పట్టించుకొనే వారు కరువు కావడంతో ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. మరో వైపు బార్ షాపుల నిర్వహణలో సమయపాలనను పాటించడదం లేదనే విమర్శలు వస్తున్నాయి. తెల్లారే దాకా నడిపిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని తెలుస్తోంది. దీంతో మందుబాబుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి.

ధర ఎక్కువ .. నాణ్యత తక్కువ

జిల్లా కేంద్రం కావడంతో భూపాలపల్లికి గతం కంటే రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో బార్ అండ్ రెస్టారెంట్ల వ్యాపారం జోరందుకుంది. నిత్యం అవి మందుబాబులతో కిటకిటలాడుతున్నాయి. మద్యం సేవిస్తున్న సమయంలో ఏదైనా ఆహార పదార్థాన్ని తీసుకోవడం పరిపాటి. అయితే.. వారికి బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు కలిషిత, నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పైకి హంగూ ఆర్భాటం కనిపిస్తున్నా.. వండేది మాత్రం పూర్తిగా కల్తీనేననే తెలుస్తోంది. రెండు మూడు రోజుల పాటు నిల్వ చేసిన ఆహారాన్ని అమ్ముతున్నారని సమాచారం. ఇటీవల ఓ రెస్టారెంట్‌లో మందుబాబులకు, నిర్వాహకుల మధ్య ఆహారం విషయంలో వాగ్వావాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ధరల విషయంలో చూపించే శ్రద్ధ నాణ్యతలో చూపడం లేదని పలువురు మందుబాబులు మండిపడుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

బార్ అండ్ రెస్టారెంట్లలో వండే ఆహారంలో సరుకులకు ఏరోజుకారోజు వినియోగించాల్సి ఉంది. వాడిన నూనె మళ్లీ వాడొద్దు. భోజనం తయారు చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. వినియోగదారులు మిగిల్చిన ఆహారాన్ని వెంటనే పడేయాలి. ఆహార పదార్థాలు, మాంసం మిగిలితే వాటిని ఫ్రిడ్జ్‌లో పెట్టొద్దు. అలాగే బార్ అండ్ రెస్టారెంట్లను ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటలకు తెరచి ఉంచాలి. సమయం దాటాక మందు విక్రయాలు జరపొద్దనే నిబంధనలు ఉన్నాయి. అయినా అవేమీ అమలు కావడం లేదని తెలుస్తోంది.



పర్యవేక్షణ శూన్యం!

భూపాలపల్లి జిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల నిఘా ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇష్టానుసారంగా విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఒక్కసారి కూడా బార్ల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి. నిర్వాహకులకు కొందరు అధికారులే వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



విద్యావలంటీర్ల కలెక్టరేట్ ముట్టడి

- వేతనాలు అందించాలని నిరసన



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న విద్యావాలంటీర్లు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక విద్యావలంటీర్లు కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల కొరత వల్ల జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 32 మందిని ప్రత్యేక విద్యావలంటీర్లుగా తీసుకున్నారని అన్నారు. అప్పటి కలెక్టర్ భవేశ్‌మిశ్రా తమ ప్రత్యేక చొరవతో ఆయన నిధుల నుంచి వేతనాలు ఇచ్చేలా చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. అయినప్పటికీ తమపై ఇప్పటి వరకు అది అమలుకు నోచుకోలేదన్నారు. అధికారులకు, కలెక్టర్లకు విన్నపాలు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు పూనుకున్నామని అన్నారు. ఇప్పటికైనా తమకు వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వీరికి డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావలంటీర్లు మౌనిక, రమ, నవ్య, శ్రీలత, రమాదేవి, జ్యోతి, నర్సయ్య, దేవేందర్, నవీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 160 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్‌ఖరే



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. నలుగురిని భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిరణ్‌ఖరే ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గణపురం మండలం రవినగర్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఎస్సై అశోక్‌తోపాటు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ములుగు వైపు నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న కారు అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని ఆపి తనిఖీ చేయగా డిక్కీలో 75 ప్యాకెట్లు కలిగి ఉన్న 160 కిలోల గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన తోట మాధవరావు, ఒడిశాకు చెందిన భీమ్‌ప్రసాద్, సోమరు టాక్రీ, విశాఖపట్నానికి చెందిన మక్కువ మోసిస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీతారామరాజు జిల్లా గూడెం మండలం దారకొండ గ్రామానికి చెందిన బాబురావు వద్ద తక్కువ ధరకు 160 కిలోల గంజాయిని కొనుగోలు చేసి భూపాలపల్లి పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు వారు అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ టాస్కులో పాల్గొన్న భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేష్, సీసీఎస్ ఎస్సైలు సాంబమూర్తి, జె.రమేష్‌తో పాటు సిబ్బందికి రివార్డులు ఎస్పీ అందించారు.

దొంగకు దేహశుద్ధి

మొగుళ్లపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామంలో యాళ్ల వీరబాబు అనే రైతు ఇంట్లో దొంగతనం చేసేందుకు వచ్చిన వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వీరబాబు రోజులాగే ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. దొంగ తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. వీరబాబు ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపల చూడగా దొంగ ఇంట్లోనే ఉన్నాడు. వీర బాబు ఇరుగుపొరుగు వారిని పిలిచి దొంగను పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దొంగను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మనుషులంతా సన్మార్గంలో నడవాలి

- రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి
- అన్ని మతాలకూ అంబేద్కర్ సమాన హక్కులు కల్పించారు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవులంతా సన్మార్గంలో పయనించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ములుగు జిల్లాకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వేడుకలకు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేశారు.

దేశంలోని అన్ని మతాల వారికి సమాన హక్కులు కలిగి ఉండాలని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సూచించారని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ పాటించాలన్నారు. ప్రపంచంలో విశ్వశాంతి కోసం ఏసుక్రీస్తు ప్రార్థనలు చేశారని, దీంతో శాంతి నెలకొందని అన్నారు. దేశానికి ప్రధాన మంత్రిగా పనిచేసిన తెలంగాణ రాష్ట్ర బిడ్డ పీవీ.నరసింహారావు సైతం ఏసుక్రీస్తును కొనియాడేవారని తెలిపారు. రాజ్యాంగ హక్కులను కాపాడడంలో పీవీ అనేక చర్యలు తీసుకున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవాన్ని పూజించే హక్కు కలిగి ఉండాలన్నారు, హిందువులు భగవద్గీత, క్రిస్టియన్లు బైబిల్, ముస్లింలు ఖురాన్‌ను అనుసరిస్తారన్నారు. తమ మతాలను గౌరవిస్తూ ముందుకుపోతున్న ప్రతి వ్యక్తి అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. అన్నిమతాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. అన్ని మతాలను గౌరవిస్తున్న వారు తమ పిల్లలను చెడుమార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో వెళ్లేవిధంగా అవగాహన కల్పించాలని అన్నారు. తాడ్వాయి మండలంలో ఉన్న పురాతన శిలువలను వెలుగులోకి తేవడానికి కృషి చేస్తానని, పాస్టర్లకు గౌరవ వేతనం, చర్చిల నిర్మాణాలకు సహకరిస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, మైనారిటీ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, పాస్టర్లు సుదర్శన్‌రావు, రవి, ఐజయ్య, బి.పాల్, అశోక్, క్రైస్తవులు పాల్గొన్నారు.



ములుగులో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి సీతక్క

అడవి ఆముదం కాయలు తిని విద్యార్థులకు అస్వస్థత

- కడుపునొప్పి, వాంతులతో ఆస్పత్రిపాలైన ఎనిమిది మంది..
- మహాముత్తారం మండలంలోని పాఠశాలలో ఘటన





భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు తిన్న అడవి ఆముదం కాయలు

మహాముత్తారం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): అడవి ఆముదం కాయలు తిని ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మహాముత్తారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోలంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గతంలో నాలుగు అడవి ఆముదం మొక్కలను నాటారు. అవి ఏపుగా పెరిగి కాయలు కాస్తున్నాయి. సోమవారం ఉదయం పాఠశాలలకు వచ్చిన విద్యార్థుల్లో ఎనిమిది మంది ఆ కాయలను తెంపుకొని తిన్నారు. ఉదయం 11.30 గంటలకు కడుపునొప్పితో వాంతులు చేసుకొని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయురాలు జాడి రజిని అప్రమత్తమై ఈ విషయాన్ని ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యుడు సందీప్ విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులు పాడి వైష్ణవి, రామినేని హర్షిత, చంద్రగిరి రుత్వీక, బీసుల శ్రీవర్షిని, రామినేని హర్ష, పిట్టల వర్షన్, రామినేని అనిర్వన్యశ్రీ, పెద్ది మహిన్విత చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. పాఠశాల ఆవరణలో నాటిన అడవి ఆముదం మొక్కల కాయలు తినకూడదని విద్యార్థులకు తెలియకపోవడంతో ఈ సంఘటన జరిగింది. అస్వస్థతకు గురైన విద్యార్థులను వంద పడకల ఆస్పత్రిలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీనుబాబు పరామర్శించారు.

మాదిగ కళాకారుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాదిగ కళాకారుల జిల్లా కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. ప్రముఖ సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా ఓనపాకల కుమార్, ప్రధాన కార్యదర్శిగా పుల్ల ప్రతాప్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పుల్యాల నరేష్, కార్యదర్శులుగా సరిగొమ్ముల సతీష్, జన్నె యుగందర్, కోశాధికారిగా శాస్త్రాల తిరుపతి, సలహాదారులుగా దొగ్గెల దేవేందర్, మిట్టపెల్లి బాలు, కల్లెపల్లి సతీష్, నిమ్మల వెంకటేష్, కోండ్ర కుమార్, దివాకర్, దాసారపు నరేష్, శ్రీను, ప్రియాంక, నిర్మల, శోభను ఎన్నుకున్నారు.

కాళేశ్వరాలయ హుండీ ఆదాయం 29.26 లక్షలు

మహదేవపూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర ముక్తీశ్వస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం ఈవో మారుతి ఆధ్వర్యంలో జరిగింది. పర్యవేక్షణ అధికారిగా నందనం కవిత హాజరయ్యారు. ఆలయానికి 56 రోజులకు రూ 29,26,494 ఆదాయం వచ్చింది. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంకు, దేవస్థాన సిబ్బంది, కరీంనగర్ అన్నమయ్య ట్రస్టు, రాజరాజేశ్వరస్వామి సేవా సమితి, కరీంనగర్ లలితా సేవా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి



ప్రజల సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారులకు జవాబుదారీతనంతో సమాధానం ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణిలో 32 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధిలో కార్మికులే కీలకం

- అంకితభావంతో పనిచేయడం వల్లే సంస్థ పురోగతి
- చీకటి సూర్యుల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లిలో ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం



సింగరేణి ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారు అంకితభావంతో పనిచేయడం వల్లే సంస్థ పురోగతి వైపు పయనిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సింగరేణి 136వ ఆవిర్భావ వేడుకలకు ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో సోమవారం ఘనంగా జరిగింది. సింగరేణి అధికారులు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను ముందుగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి జగతికి వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. వీరికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటూ ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఏమైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం సింగరేణిలో యువ కార్మికులు, మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుండటం హర్షణీయమన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందన్నారు. రోగులకు అన్ని రకాల సౌకర్యాలు అక్కడ అందుబాటులో లేవన్నారు. ఈ విషయం ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ బలరాం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు ఈ ప్రాంత అభివద్ధికే కేటాయించేలా కృషిచేస్తామని అన్నారు. బొగ్గు గనుల విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు. వారికి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సింగరేణి, రెవెన్యూ అధికారులు సమన్వయంగా భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అవినీతికి తావులేకుండా భూనిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు.

భూపాలపల్లి ఏరియాకు 40 ఏళ్ల ఉజ్వల భవిష్యత్తు : జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి ఏరియాకు ఇంకా 40 ఏళ్ల ఉజ్వల భవిష్యత్తు ఉందని సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రధానపాత్ర

» మిగతా 8వ పేజీలో...

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మార్కెట్ చైర్మన్ శివరాజ్, ఆర్డీవో గోపిరామ్

జనగామ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రీ క్రిస్మస్ వేడుకలను జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, ఆర్డీవో గోపిరామ్ హాజరై కేక్ కట్ చేశారు. ప్రభుత్వం అన్ని కులాలు, మతాలకు సముచితం స్థానం కల్పించి, వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.

కడియంను కలిసిన కబడ్డీ అసోసియేషన్



కడియం శ్రీహరిని కలిసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 30 వరకు జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి రావాలని సోమవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జనగామ జిల్లా కబటీ అసోసియేషన్ బాధ్యులు హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్ యాదవ్, తోటకూరి గట్టయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, అన్నెపు కుమార్, సీహెచ్ సుధాకర్ తదితరులు కడియంను కలిసిన వారిలో ఉన్నారు.

మార్కెట్‌లోనే కందులను విక్రయించాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి కందులను పండించిన రైతులు దళారులకు విక్రయించి నష్టపోకుండా మార్కెట్‌లోనే విక్రయించి మద్దతు ధరలను పొందాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి సూచించారు. సోమవారం మార్కెట్ ఆవరణలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటా కనీస మద్దతు ధర రూ.7,550 ఉండగా ఓ రైతు తీసుకువచ్చిన కందులకు ట్రేడర్ క్వింటా రూ.8,711 వేలం పాడి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సెక్రటరీ జన్ను భాస్కర్, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, డైరెక్టర్లు భాస్కుల కిరణ్, ఇల్లెందుల బాబు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్, ప్రతినిధులు

జఫర్‌గఢ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల విద్యాప్రగతి కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) పోరాటం సాగిస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ అన్నారు. సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం హిమ్మత్‌నగర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో ఆవిష్కరించి మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ సందర్భంగా ఈనెల 28 నుంచి 30 వరకు నల్గొండలో పెద్దఎత్తున మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న భారీ ర్యాలీ, బహిరంగ సభ, 29, 30 తేదీల్లో ప్రతినిధుల సభలు, చర్చ, వివిధ వక్తలచే ఆలోచనాత్మక ప్రసంగాలు ఉంటాయన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వంశీకృష్ణ, ఉపాధ్యాయులు జితేందర్, కవిత, వనజాత పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలి

- రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల వైపు దృష్టి సారించాలి
- అటారి డైరెక్టర్ జోన్-10 షేక్‌మీరా
- మల్యాలలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



జాతీయ రైతు దినోత్సవంలో రైతులను సన్మానిస్తున్న షేక్‌మీరా, మాలతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు కృషి చేయాలని అటారి డైరెక్టర్ జోన్-10 షేక్‌మీరా సూచించారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయ పాఠశాల కేంద్రాన్ని ప్రాంతీయ పీజేటీఏయూ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జమునరాణి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మధ్య తెలంగాణ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీరా మాట్లాడుతూ వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే విధంగా వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల వైపు దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలని, యాంత్రీకరణ వైపు రైతులు దృష్టిసారించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. యువశాస్త్రవేత్తలు అన్నివేళలా రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

తెలంగాణ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడి మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని, పంట మార్పిడి చేయాలని, సమీకృత వ్యవసాయం మంచి నాణ్యమైన రకాలను సాగు చేసి అధిక దిగుబడి పొందాలన్నారు. టీజేటీఎస్‌ఏయూ డీఈ జమునరాణి మాట్లాడుతూ రైతులు కష్టం వల్లే దేశంలో ఆహారభద్రత ఉందని తెలిపారు. ప్రిన్సిపల్ సైంటిస్టు వెంకన్న మాట్లాడుతూ యాసంగిలో సాగుచేసే వరిరకాల వివరాలను వివరించారు. అంతేకాకుండా అధిక సాంద్రతతో పత్తి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే పరిశోధన స్థానం సమన్వయకర్త మాలతి, ప్రిన్సిపల్ సైంటిస్టు వీరన్న, శాస్త్రవేత్తలు ఎన్.కిశోర్‌కుమార్, రాంబాబు, క్రాంతికుమార్‌తో పాటు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల, ఉద్యానవన అధికారి మరియన్నతో పాటు మహబూబాబాద్, మరిపెడ ఏడీఏలు శ్రీనివాసరావు, విజయచంద్ర, రైతులు గోపాల్‌రెడ్డి, యాదగిరి, కృష్ణారెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్దారం గ్రామంలో భర్త, అత్త వేధింపులకు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బుద్దారం గ్రామానికి చెందిన సంపసాల మాధవి ఆదివారం రాత్రి ఆమె భర్త రైల్వే ఉద్యోగి సంపసాల రామకృష్ణ, అత్త లాలమ్మ వేధింపులు గురిచేయడంతో మాధవి పురుగుల మందు ఉదయం తాగి ఇంట్లో పడుకుంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్పృహ కోల్పోయిన మాధవిని చూసి, బంధువులు గార్ల ప్రభుత్వ ఆస్పత్రి తరలించి ప్రాథమిక చికిత్స జరిపించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడంతోపూర్తివివరాలుతెలియాల్సిఉంది.

గంజాయి పట్టివేత

డోర్నకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరిసీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడకు చెందిన కిముడు గోపి అనే వ్యక్తి డోర్నకల్ రైల్వేస్టేషన్ ఏరియాలో బ్యాగుతో సంచరిస్తున్నాడు. అక్కడ ఉన్న పోలీసులు అనుమానం వచ్చి, అతడి బ్యాగును తనిఖీ చేయగా అందులో సుమారు 7కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తరలిస్తున్న కిముడు గోపిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



డోర్నకల్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టును చూపుతున్న పోలీసులు

కొడుకు మరణం తట్టుకోలేక ఆగిన తల్లి గుండె



చిలుపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో కన్నకొడుకు మృతి చెందడంతో మనోవేదనకు గురైన ఆ తల్లి కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే గుండెపోటుకు గురై తనువు చాలించింది. ఈ ఘటన మండలంలోని వంగాలపల్లిలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల కన్నయ్య(37) పాలు విక్రయించడం కోసం వెళ్లి ఈనెల 15న హన్మకొండ నిట్ కళాశాల ఎదుట రోడ్డు క్రాస్ చేస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అతని అవయవాలను 19న దానం చేశారు. కొడుకు అకాల మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన అతని తల్లి ఆవుల రామక్క (58) ఆదివారం(22న) గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబ సభ్యులు తొలుత హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. వైద్యుల సూచనతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఐదు రోజుల వ్యవధిలోనే తల్లీ, కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

బినామీ పట్టాలు రద్దు చేయాలి

- పలిమెల భూములను సందర్శించిన ప్రజా సంఘాల నేతలు



భూముల వద్ద మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రం శివారులో బినామీ పేర్లతో ఉన్న పట్టాలను రద్దు చేసి అసలైన రైతులకు ఇవ్వాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. పలిమెల మండల కేంద్రంలోని సిమెంటుకు కంపెనీకి రిజిస్ట్రేషన్ అయిన భూములను వారు సోమవారం పరిశీలించారు. రైతుల భూములను అక్రమంగా పట్టా చేసుకోవడమే కాకుండా డెక్కన్ సిమెంట్ కంపెనీకి గోప్యంగా 102 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడం దారుణమన్నారు. 2008 నుంచి ఇక్కడి ప్రజలకు నాయకులు పట్టాలు చేస్తామనడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు దీనిని రాజకీయ కోణంగా చూడకుండా రైతులకు మేలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్, యూవైఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాబు యాదవ్, దయ్యం పోశయ్య, కిరణ్ కారు, వెంకటేశ్ కుమ్మరి, శ్రీనివాస్, మధునయ్య, లచ్చయ్య, సీపీఐ(ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యులడు గంధం శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు భూ పంపిణీ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రామన్నగూడెం వాసుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రామన్నగూడెం వాసులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో 1998 సంవత్సరంలో నాటి ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని పేదల కోసం భూమి కొనుగోలు చేసి పట్టాలిచ్చారే తప్ప భూమి ఇవ్వలేదని, వారందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, నెల్లికుదురు మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు మాట్లాడారు. ఇంటి స్థలాల పంపిణీపై అనేక మార్లు ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టా పొందిన ప్రతీ ఒక్కరికి స్థలాన్ని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బాబుగౌడ్, నర్సయ్య, మైస రాములు, బండి సోమయ్య, సైదమ్మ, జయమ్మ, ప్రభాకర్, పద్మ, వెంకటయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్



మంగపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కబ్బాక శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) 9వ రాష్ట్ర మహాసభలు ఏటూరునాగారంలో జరగ్గా జాతీయ కన్వీనర్ రమణల లక్ష్మయ్య సమక్షంలో ఈ మేరకు ఎన్నుకున్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుకు మెరిట్ లిస్టు సిద్ధం

నెహ్రూసెంటర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఫైనల్ జాబితా సిద్ధం చేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లాలోని బ్లడ్‌బ్యాంకుల్లో పనిచేసేందుకు ఖాళీగా ఉన్నఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఫైనల్ మెరిట్ జాబితాను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mahabubabad.telangana.gov.in లో పొందపరచడం జరిగిందని తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి 1.3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసినట్లు చెప్పారు. అభ్యర్థులకు సంక్షిప్త సమాచారం కోసం ఎస్ఎంఎస్‌ల ద్వార తెలియజేసినట్లు చెప్పారు. మంగళవారం (నేడు) ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

తుడుందెబ్బ నాయకుల ఆందోళన

- ఐటీడీఏ భవనం పైకెక్కి నిరసన
- సీఆర్టీల జనరల్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన సీఆర్టీల జనరల్ నోటిఫికేషన్‌ను రద్దుచేసి కొత్త దానిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ నేతలతు డిమాండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్‌ను తొలగించాలని కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం భవనం పైకెక్కి సోమవారం నిరసన తెలిపారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట 163వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసె బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా డిప్యూటీ డైరెక్టర్ పోచం వ్యవహర శైలి ఉందని విమర్శించారు. ఆదివాసీల హక్కులను హరించే విధంగా ఆయన వ్యవహరిస్తున్నారని, ఆయన్ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 29 శాఖల్లో 100 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావాలని, సీఆర్టీ నోటిఫికేషన్ పూర్తిగా ఆదివాసీ అభ్యర్థులచే పూర్తి చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును ఐటీడీఏ ద్వారా చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ వలసలను అరికట్టాలని, గిరి వికాసం పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవ నిర్మాణ సేనా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, తుడుందెబ్బ నాయకులు దబ్బకట్ల శ్రీకాంత్ వంక నరేష్, ఎట్టి రాజేష్, ఉపాధ్యాయ సంఘం నాయకులు మైపతి సంతోష్, విద్యార్థి సంఘం నాయకులు కొర్నిబెల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయ భవనం ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

వినతులు సమర్పించిన గిరిజనులు



దర్బార్‌లో డీడీ పోచానికి వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనులు వినతులు సమర్పించారు. డిప్యూటీ డైరెక్టర్ పోచంకు తమ సమస్యలను విన్నవించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 11 మంది తమ సమస్యలను డీడీ దృష్టికి తీసుకెళ్లారు. మల్లూరులోని శ్రీ హేమచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో చేపట్టే అభివృద్ధి పనులను పెసా గ్రామసభ తీర్మానంతోనే చేపట్టాలని మల్లూరుకు చెందిన తాటి విజయ్ వినతి పత్రం అందించారు. తన కూతురు వికలాంగురాలని, ఐటీడీఏ ద్వారా నాలుగు చక్రాల స్కూటీని ఇప్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బానోతు సరోజ వేడుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వాటికి బిల్లులు మంజూరు చేయాలని గోవిందరావుపేట మండలానికి చెందిన ఈర్ల పావులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, ఏపీవో సంతోష్ పాల్గొన్నారు.

సోది చెబుతానమ్మా.. సోది..

- సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన



'సోది చెబుతానమ్మ సోది' అంటూ వినూత్న నిరసన

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం వినూత్న తరహాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పనితీరును ఎండగట్టేలా ఓ మహిళా ఉద్యోగిని 'సోది చెబుతానమ్మా.. సోది..' అంటూ నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర ఉద్యోగుల సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు చల్లా సునీత మాట్లాడుతూ 18 ఏళ్లుగా తాము సమగ్ర శిక్షాలో సేవలందిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మర్శించారు. తమగోడును అర్థం చేసుకున్న రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇస్తూ టీ తాగే సమయంలో రెగ్యులర్ చేసే ప్రక్రియ పూర్తిచేస్తానని అన్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తడం లేదని అన్నారు. ఇప్పటికైనా తమ డిమాండ్‌ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాంద్‌పాషా, వేణు, సుమలత, శైలజ, మహేశ్వరి, ఈశ్వరి, నరేష్, కనకలక్ష్మి, శ్రీలత, రజిత, నిర్మల, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో వంటావార్పు

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగులు ములుగులో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సమ్మె శిబిరం వద్ద రోడ్డుపై ఉద్యోగులు వంటావార్పుతో వినూతన్న నిరసన చేపట్టారు. అనంతరం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రతి ఉద్యోగికి జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షలు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 61ఏళ్లు నిండినవారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు రాజేశ్వరి, స్పెషలాఫీసర్లు జయ, వసంతలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6900	3000
పల్లికాయ (పచ్చిది)	5350	4500
కందులు	-	-
పెసళ్లు	7612	4000
పత్తి	6970	5800
పసుపు (కాడి)	11002	10235
పసుపు (గోల)	10952	9565
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15200	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341ఏసీ	13500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

- రంగును బట్టి కలపకు మార్కెట్లో డిమాండ్
- కిలో ధర రూ. 2 వేల నుంచి రూ. 2500 వరకు
- పడవలు, సంగీత వాయిద్యాలు, ఔషధాల తయారీకి వినియోగం

సిరులు కురిపించే మహోగని

'డబ్బుల చెట్ల' పెంపకం చేపట్టిన పాలకుర్తి మండల రైతులు



కోతులబాదులో రైతు రాములు పెంచుతున్న చెట్లు



మహోగని చెట్ల పెంపకంతో భారీ లాభాలు గడించొచ్చు

మహోగని ఆకులను మందుల తయారీకి ఉపయోగిస్తారు. క్యాన్సర్, షుగర్ లాంటి మాత్రల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ చెట్ల పెంపకం వల్ల ఆర్థికంగా అధిక లాభాలు గడిస్తారు. కానీ అందుకు 12 సంవత్సరాల సమయం పడుతుంది. ఆ తర్వాత ఎకరం, రెండెకరాలు సాగు చేసిన లక్షల్లో ఆదాయం ఉంటుంది. రైతులు ఇలాంటి చెట్లను సాగు చేసేందుకు దృష్టి పెట్టాలి. ఈ కలపను పడవల తయారీకి కూడా ఉపయోగిస్తారు.

- కాక రవిదొర, ఫారెస్టు బీట్ ఆఫీసర్ పాలకుర్తి

పాలకుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో అమ్మనో.. నాన్ననో.. డబ్బులు అడిగినప్పుడల్లా డబ్బులేమైన చెట్లకు కాస్తున్నాయా? అంటుంటారు. చెట్లకు డబ్బులు కాయకపోయినప్పటికీ.. సిరులు కురిపించే చెట్లు ఉన్నాయి. అలాంటి చెట్లను పెంచాలనాన్న.. సిరులు సొంతం చేసుకోవాలన్నా.. చేయాల్సింది ఒకటే. మనకున్న స్థలంలో అది కొద్దిపాటిదైనా ఆ మొక్కలను నాటి.. 12ఏళ్ల సాకితే చాలు అవే ధనవంతులను చేస్తాయి. ఆ చెట్ల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. ఎందుకంటే వాటి కున్న విలువ అలాంటిది. ఇంతకీ ఆ చెట్టేంటంటా.. మహోగని చెట్లు. డబ్బుల చెట్టుగా చెప్పుకొంటున్న ఆ చెట్లను పాలకుర్తి మండలంలోని బమ్మెర. కోతులబాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు పెంచుతున్నారు. బమ్మెరకు చెందిన నర్సింహరెడ్డి పదెకరాల్లో, కోతులబాదుకు చెందిన మరో రైతు చురకంటి రాములు నాలుగు ఎకరాల్లో ఈ చెట్లను వేశారు. హైదరాబాద్ నుంచి మూడేళ్ల క్రితం మొక్కలు (చతుర్వేద) కంపెనీకి చెందిన ఎకరానికి 50 మొక్కల చొప్పున 400 మొక్కలు కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క రూ.40 నుంచి రూ.200వరకు ధర ఉండగా.. ఎకరంలో మొక్కలు నాటేందుకు రూ.50వేల నుంచి రూ. 60 వేలు ఖర్చు అవుతుంది. 9 అడుగులకు ఒక మొక్క చొప్పున ఈ మొక్కలు నాటాలి. మూడు నెలలకోసారి ఎకరానికి ఒక బస్తా డీఏపీ, యూరియాను చల్లాలి. ప్రభుత్వం ఈ మహోగని చెట్ల పెంపకానికి ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదు. డ్రిప్ సాయంతో నీటిని ఎక్కువగా అందించాలి. ముఖ్యంగా వేసవిలో నీటిని ఎక్కువగా అందిస్తే చెట్లు ఏపుగా పెరగడానికి దోహదపడుతాయి. ఈ క్రమంలో సదరు రైతులు ఇప్పటి వరకు ఎకరానికి రూ.1లక్ష చొప్పున ఖర్చు చేశారు. ఈ చెట్లు పరిపక్వం చెందడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఐదేళ్లకోసారి విత్తనాలను ఉత్పత్తి చేస్తాయి. హైదరాబాద్, మహారాష్ట్రలో లభించే ఈ మహోగని చెట్లను పెంచిన రైతులు 12 ఏళ్లలో లక్షాధికారులు అవుతారని చెబుతున్నారు.

మహోగని కలప, వినియోగం..

మహోగని కలప సముద్రాల్లో పడవలకు, సంగీత వాయిద్యాలకు విగ్రహాల తయారీలోనూ, వాటర్ క్రాఫ్ట్ అలంకార ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తారు. అంతే కాకుండా విత్తనాలను కొన్ని ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ముఖ్యంగా షుగర్, క్యాన్సర్, బీపీ లాంటి రుగ్మతల నివారణకు వాడే వైద్యంలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారని చెబుతున్నారు. ఈ చెట్ల ఆకులు వ్యవసాయ పురుగు మందులుగా ఉపయోగిస్తారని కూడా చెబుతున్నారు. దీని ఆకులు పెద్దవిగా ఉంటాయని, 40 మిల్లీ మీటర్ల పొడవు వరకు మెరుస్తూ ఉంటాయి. సబ్బులు, పెయింట్ లాంటి తయారీలో కూడా మహోగని చెట్ల నుంచి తీసిన నూనెలను వినియోగిస్తారు. ఈ చెట్టుకు సంబంధించిన ప్రతీ భాగం ఏదోఒక విధంగా ఉపయోగపడుతుంది.

గుట్టల ప్రాంతాల్లో కాకుండా..

ఈ మహోగని చెట్లు గుట్టల ప్రాంతాల్లో కాకుండా అన్ని నేలల్లో సాగుచేసుకొవచ్చు. ఈ చెట్టు కలప రంగును బట్టి మార్కెట్లో గిరాకీ ఉంటుంది. ఎరుపు రంగులో ఉన్న కలప ధర క్యూబిక్ ఫీట్‌కు రూ.1,300 నుంచి రూ. 2,500 వరకు మార్కెట్లో పలుకుతుంది. ఒక్కో చెట్టు 60 నుంచి 80 అడుగులు పెరుగుతుంది. దీనిని బట్టి చూస్తే ఈ చెట్టు 40క్యూబిక్ అడుగులు పెరుగుతుంది. క్యూబిక్ ఫీట్‌కు ధర రూ. 1,500 అనుకున్నప్పటికి ఒక చెట్టు రూ. 60 వేల వరకు అమ్ముడవుతుంది. ఈ చెట్ల పెంపకంపై ఆసక్తి చూపేందుకు రైతులు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.4లక్షల చేశా



మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి మహోగని మొక్కలు తెచ్చి నాలుగు ఎకరాల్లో నాటాను. నాటేందుకు, యూరియా, కూలీల ఖర్చుతో పాటు నీటి కోసం డ్రిప్ పైపులు కూడా తీసుకువచ్చాను. మూడు నెలలకు ఒక సారి డీఏపీ, యూరియా చల్లుతున్నా. ఇప్పటి వరకు అన్ని ఖర్చులు చూసుకుంటే రూ.4లక్షలు ఖర్చు చేశాను. ఈ చెట్లు అమ్మకానికి రావడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఆదాయం బాగానే వస్తుందని ఆశాభావంతో ఉన్నా.

- చురకంటి రాములు, కోతులబాదు, పాలకుర్తి మండలం

12 ఏళ్ల తర్వాత ఆదాయం



కొత్త రకమైన పంట అని మహోగని చెట్లను పది ఎకరాల్లో సాగుచేశా. హైదరాబాద్ నుంచి ఒక్కో మొక్క రూ.100చొప్పున కొనుగోలు చేసి నాటించాను. ఇప్పటి వరకు రూ.6లక్షలు ఖర్చు చేశా. నెలకు ఒకసారి కూలీలతో చెట్టు మొదట్లో ఉన్న గడ్డిని తొలగించాలి. డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నాం. ఇంకా ఏడు సంవత్సరాలు వరకు ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఆ తర్వాతే ఆదాయం ఎంత వస్తుందని తెలుస్తుంది.

- ముస్కు నర్సింహరెడ్డి, బమ్మెర మండలం పాలకుర్తి

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేశారు..
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించిన మాజీ మంత్రి హరీష్‌రావు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాజీ మంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ నేతలు

వరంగల్ మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో పేద రోగుల వైద్య సేవల కోసం నిర్మించతలపెట్టిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీష్‌రావు ఆరోపించారు. వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో 24 అంతస్థులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీష్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు 84శాతం పూర్తి అయ్యాయని, కేవలం 16శాతం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు పూర్తవుతున్నప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేస్తున్నారని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. పేదలకు సూపర్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ వరంగల్ కేంద్ర కారాగారంలో 24 అంతస్థుల్లో ఆస్పత్రి పనులు ప్రారంభిస్తే.. వాటిని పూర్తి చేయాల్సిన రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2024 జూన్ వరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలని ప్రతిపాదనలు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి గాలికి వదిలారని విమర్శించారు. 14 అంతస్థుల్లో హాస్పిటల్, మరో 10 అంతస్థుల్లో అడ్మినిస్ట్రేషన్ భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పంతో ముందుకు వెళితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను దోచుకునే పనిలో ఉందన్నారు. కేవలం కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని హరీష్‌రావు విమర్శించారు.



ఆస్పత్రిని నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

ఎంజీఎం ఆస్పత్రిలో రోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంపాటు ఓర్పుతో వ్యవహరించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను తొక్కి సీఎం అయ్యాడని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే వారి పనిగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి టి.హరీష్‌రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లాక్‌బెర్రీ'ని సందర్శించిన మంత్రి సీతక్క

దీవిలో పర్యాటకుల సౌకర్యాలు పరిశీలన



క్యాంప్‌ఫైర్ వద్ద మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, తదితర అధికారులు, నాయకులు

మేడారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం అటవీ ప్రాంతం మొండ్యాలతోగు పరిసరాల్లోని బ్లాక్ బెర్రీ దీవిని రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాలతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ ఐలాండ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి ట్రయల్ రన్ చేశారు. కనులవిందు కలిగే అడవి మధ్యలో బ్లాక్ బెర్రీ దీవిలో వసతులు, సౌకర్యాలు ఉన్నాయని మంత్రి అన్నారు. కలెక్టర్ క్రూషల్ నిధులతో అటవీశాఖ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో పకృతిని గుర్తించామని, ఈ ఐలాండ్ త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. పస్రా తాడ్వాయి 163 జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడం పర్యాటకులకు అందుబాటులో ఉందన్నారు. ఐలాండ్ అందాలను ప్రతీ ఒక్కరు కుటుంబ సమేతంగా వచ్చి చూడాలని సూచించారు. పిల్లలకు వినోదాత్మకంగా ఆట వస్తువులు, పర్యాటకులు వినోదానికి వాలీబాల్, బ్యాట్‌మెంటన్ క్రీడా ప్రాంగణాలు, ఎత్తైన మంచె, వసతి గృహలు, క్యాంప్‌ఫైర్ ఏర్పాట్లు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ఐలాండ్ చుట్టూ వాగు మధ్యలో ఐదెకరాల స్థలంలో ఇసుక దిబ్బగా ఉండి బ్లాక్ బెర్రీ చెట్లతో పకృతి అందాలున్నాయని వివరించారు. ములుగు జిల్లాలో మరిన్ని పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జాదవ్, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోల్లెపల్లి రాజేందర్ గౌడ్, జిలా నాయకుడు పోషాలు యాదవ్, తాడ్వాయి అటవీశాఖ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారిణి భాగ్యను ఆదుకుంటాం

ప్రభుత్వవిప్ బీర్లా ఐలయ్య కురుమ



గూడూరులో భాగ్యను అభినందిస్తున్న బీర్ల ఐలయ్య

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యాంగ క్రీడాకారిణి దయ్యాల భాగ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమ, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ భరోసా ఇచ్చారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభకు ఐలయ్యతో పాటు ఎమ్మెల్యే, తెలంగాణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క, కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ క్రమంలో భాగ్య గోల్డ్‌మెడల్ సాధించిన విషయాన్ని విమలక్క వేదికపైనున్న వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని గూడూరు శివారు గొల్లగూడెంకు చెందిన దయ్యాల కొమురయ్య- కొమురమ్మ కుమార్తె భాగ్య నిరూపించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 5వరకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీ య పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ ను చాటి, బంగారుపతకం సాధించడం హర్షనీయమన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి, మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన భాగ్యను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి, ప్రభుత్వ పరంగా లబ్ధిని చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. భాగ్యకు ఇంటిస్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

కేయూలో పీహెచ్‌డీ అశావహుల ఆందోళనలు

- వీసీ చాంబర్‌లో బైఠాయింపు
- అడ్డుకున్న పోలీసులు.. స్టేషన్‌కు తరలింపు..



చాంబర్‌లో బైటాయించి నిరసన చేస్తున్న మంద నరేశ్, అనిల్, తిరుపతి తదితరులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల గొడవ రచ్చకెక్కింది. సోమవారం ఏబీవీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో పీహెచ్‌డీ అశావహులు తమకు అడ్మిషన్లు కల్పించాలని వైస్‌చాన్స్‌లర్ చాంబర్‌లో బైఠాయించారు. తాము అమరణ నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో తమకు అడ్మిషన్లు ఇప్పించాలని వాగ్వాదం చేశారు. గొడవ విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు విద్యార్థులను, అధికారులను సముదాయించారు. దీంతో విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం గేట్ల వద్ద బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వర్సిటీ పరిపాలన భవనం గేటు వద్ద నిరసన దీక్షల్లో ఉన్న ఆశా వహులను సీఐ రవికుమార్ దీక్షలు విరమించాలని హెచ్చరించారు. తర్వాత పోలీసు వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మంద నరేశ్, సోరపాక అనిల్, మాలోతు తిరుపతిలు మాట్లాడుతూ.. 2021-22 అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో సీట్లు తక్కువగా చూపించి రెండేళ్ల తర్వాత ఉన్న సీట్లను పెంచి రిటైరైన ప్రొఫెసర్లకు గైడ్‌షిప్‌లు కల్పించారని చెప్పారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అయితే పీహెచ్ అడ్మిషన్ల కోసం ఎటువంటి సప్లిమెం టరీ నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో మిగతా అభ్యర్థులందరికీ అడ్మిషన్లు లేదని చెప్పారు. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డిలు తమకు న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖఅధికారులకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం వర్సిటీ అధికారులు లేఖలు రాశామని చెప్పినట్లు పీహెచ్‌డీ అశా వహులు తెలిపారు. త్వరలోనే తమకు న్యాయం జరుగుతుందని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేయూ సీఐ రవికుమార్ ఆందోళనకు దిగిన విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్ నేతృత్వంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, గౌతమ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు కష్టాన్ని నమ్ముకునోళ్లు

రజాకార్లను ఎదిరించిన యోధుడు దొడ్డి కొమురయ్య

- ఆయన పేరు శాశ్వతంగా గుర్తుండేలా చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- గూడూరులో కొమురయ్య విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఐలయ్య

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కురుమలు అత్యంత నమ్మకస్తులని, ఎంతో నిజాయితీ పరులని, కష్టాన్ని నమ్ముకున్నోళ్లని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకురుమ కొనియాడారు. సోమవారం గూడూరు మం డల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. ఊర్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని తాను చెబుతున్నానని, వారికి భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చిస్తారన్నారు. పార్లమెంట్ లోనూ కురుమ సోదరుల ప్రాతినిత్యం పెంచుతామని వివరించారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దొడ్డు కర్రల సంఘం పెట్టి, పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్యని పేర్కొన్నారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, పెత్తదారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అమరత్వం పొందారని, దొరలకు వ్యతిరేకంగా పోరాడటమంటే సులువైన వ్యవహారం కాదన్నారు. బడుగుబలహీన వర్గాల ప్రజలను ఐక్యం చేసి, వెట్టి చాకిరి లాంటి సామాజిక దురాచారాలను ఎదురించిన వీరుడు కొమురయ్య అన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులు ఆలపించిన గీతాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం, క్యామ మల్లేశం, చీర భిక్షపతి, చెవెళ్ల సంపత్‌కుమార్, నర్సింహా, కె.శ్రీనివాస్, మంత్రి సుభాష్, ఆరె వీరన్న, చిట్టి వెంకటేశ్వర్లు, ముదురు సాంబయ్య, నూనావత్ రమేష్‌నాయక్, వాంకుడోతు కొమ్మాలు నాయక్, కోరె రాంబాబు, చీర అశోక్, మండల ఉపేందర్, కుండె కిషన్, పోతరాజు రవి, కోరె దేవేందర్, మల్లేష్, శ్రీనివాస్, కుమారస్వామి, అనిల్, బీరయ్య, పాపయ్య, కుమారస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి : విమలక్క



కురుమ కులస్థులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. కురుమ కులస్థులు తమ పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే అన్ని సాధ్యమవుతాయన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో న్యాయమైన వాటా కోసం పోరాడాలన్నారు. పాలకవర్గాలు కులాలను విభజించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని, అందరు ఐక్యంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కురుమ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కురుమ సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురైందని చెప్పారు. రాష్ట్రంలో పది శాతం ఉన్న కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

నమ్మకానికి మారుపేరు

- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కురుమలు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. నమ్మకానికి మారుపేరు, మృదుస్వభావులు కురుమ సోదరులని, అలాంటి సామాజిక వర్గంనుంచి వచ్చిన పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య. సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిన వ్యక్తని కొనియాడారు. కురుమల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తనవంతుగా గూడూరులో కురుమ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.



సభలో పాల్గొన్న కురుమలు

ప్రజావాణి వినతులపై సకాలంలో స్పందించాలి

● అధికారులతో కలెక్టర్ దివాకర



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరగ్గా ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 39 వినతులు దాఖలయ్యాయి. వీటిపై అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. అదేవి ధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం గ్రామాల్లో చేపట్టిన సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సౌమ్య

వెంకటాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మైనారిటీ కళాశాలకు చెందిన విద్యార్థిని కె.సౌమ్య రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ప్రిన్సిపాల్ వందన సోమవారం తెలిపారు. తాడ్వాయి మండలం లోని కర్లప ల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీల్లో సౌమ్య అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని అన్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని హకీం పేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



కలెక్టరేట్‌లో దివ్యాంగ మహిళలను పలకరిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కలెక్టరేట్ సమావేశ మంది రంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవం జరగ్గా మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు దృష్టి పెడితే సాధించనది ఏదీలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్ర మాలు అమలుచేస్తోందని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభు త్వం ఒక ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ట్రైసై కిళ్లు, బైక్‌లు, లాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనం తరం వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విజే తలకు మంత్రి సీతక్క బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, డీడబ్ల్యూవో శిరీష, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు పూజారి మాణిక్య వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, డీసీపీవో ఓంకార్, జిల్లాస్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్య, వైద్యం పట్ల ప్రత్యేక చొరవ చూపాలి

అధికారులు అంకితభావంతో పనిచేసి జిల్లాలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్లాస్టిక్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూ బాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే ప్రతి పథకం సకాలంలో లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలన్నారు. జిల్లాలో విద్యను బలోపేతం చేయడానికి పలు సంస్థల సహకారం తీసుకోవడంతోపాటు సీఎస్‌ఆర్ నిధులను వినియోగిస్తున్నామని అన్నారు. ఇటీవల లక్నవరం సరస్సులో మూడో దీవిని ప్రారంభించామని తెలిపారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతోపాటు అడవులను రక్షించుకోవడమే ధ్యేయంగా ఆయా శాఖల అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. మహబూ బాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న అన్నిశాఖల అధికారులు అంకితభావంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయాశాఖల అధికారులు అభివృద్ధి పనులపై అంచనాలు తయారుచేసి సమర్పించిన పక్షంలో కేంద్రం నుంచి నిధులు తేవడానికి సహకరిస్తానని తెలిపారు. జిల్లాలో ఎంఆర్‌ఐ పరీక్ష కేంద్రం ఉన్నప్పటికీ ఏజె న్సీలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో మరో ఎంఆర్‌ఐ పరీక్ష కేంద్రాన్ని నెలకొల్పడానికి కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధిని నిర్ధారణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.5లక్షలు ఏజెన్సీ ప్రాం తాలకు అందిస్తోందని, అదే తరహాలో ములుగు జిల్లాకు నిధులు తెప్పించ డానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో కొత్త అభివృద్ధి కార్యక్రమాల పనులను త్వరితగతిన ప్రారంభించాలని, ఏజెన్సీలోని పలుశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరారు.

నేడు కన్నాయిగూడెం మండలంలో సీతక్క పర్యటన

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క కన్నాయిగూడెం మండలంలో మంగళవారం పర్యటించనున్నారు. ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆమె కాన్వాయి బయల్దేరుతుంది. ఉదయం 8.30 గంటలకు మండలంలోని కొత్తూరుకు చేరుకుని సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నారు. మండల కేంద్రం నుంచి చిట్యాల వరకు, మండల కేంద్రం నుంచి భూపతిపూర్ వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.

ఆదివాసీలు హక్కులు కాపాడుకోవాలి

తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య

ఏటూరునాగారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు తమ హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాటాలు చేయాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణల లక్ష్మయ్య అన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) 9వ రాష్ట్ర మహాసభలు రెండో రోజు సోమవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఆదివాసీలు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నినరు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా వట్టం ఉపేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమురం శేషయ్య, కొమురం ప్రభాకర్, గంట సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుంపిడి వెంకటేశ్వర్లు, గంజి రాజన్న, మల్లెల రాము, కోరం శేషయ్య, వట్టం కన్నయ్య, రాష్ట్ర కార్యదర్శులుగా పుణెమ్ బాలకృష్ణ, చింత కృష్ణ, వర్స శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా గొంది నాగేష్, పూనేం శ్రీనివాస్, కోశాధికారిగా అరెం నారాయణ, సాంస్కృతి కార్యదర్శిగా రాజు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా సిడం జంగుదేవ్, ప్రధాన కార్యదర్శిగా యాప అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ యాసం రాజు, ములుగు జిల్లా అధ్యక్షకార్యదర్శులు వట్టం జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిరక్షించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారం గ్రామపంచాయతీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని, అధికారులు సర్వేచేపట్టి స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య కోరారు. ఈమేరకు సోమవారం ఆయన గ్రామపంచాయతీ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామపంచాయతీ స్థలం జాతీయ రహదారిని అనుకుని ఉన్నందున కొందరు వ్యక్తులు ఆస్థలాన్ని ఆక్రమించుకుని శాశ్వత నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దీంతో పంచాయతీ ఆదాయ వనరు కోల్పోతుందని అన్నారు. ఆయన వెంట నాయకులు రాస రాజన్న, సాదిరెడ్డి, చంద్రునాయక్, సాంబయ్య, కోట సాంబయ్య, తదితరులు ఉన్నారు.

రామయ్యపల్లిని పంచాయతీ చేయాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని కాసిందేవిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామయ్యపల్లి గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 750మంది జనాభా ఉన్నారని, ఇందులో 470మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఇందుకు స్పందించి ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భూక్య అమర్‌సింగ్, బాదావత్ రవికుమార్, గుగులోత్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

మంగపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్తువుల కొనుగోలులో సరైన జాగ్రత్తలు పాటించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాగూర్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కమలాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం విద్యార్థులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ వస్తువులు, లోపభూయిష్ట సేవలు వినియోగదారులు ఎదర్కొన్నప్పుడు న్యాయం పొందేందుకు ఫిర్యాదు చేసే అవకాశం, చట్టబద్ధత కలిగి ఉందని, వినియోగదారుల ఫోరం స్థానంలో వినియోగదారుల కమిషన్లు ఏర్పడ్డాయని, 2019 నూతన వినియోగదారుల హక్కుల చట్టం వినియోగదారులకు అనేక వెసులుబాటు కల్పించిందని అన్నారు. వస్తువుల ఎంపికలో అసలు, నకిలీ నాణ్యత విషయాల్లో రాజీపడకుండా సరైన ధర చెల్లించి అందుకు సమానమైన నాణ్యత గల వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు చల్లగురుగుల మల్లయ్య, భూపాలపల్లి మానిటరింగ్ సభ్యుడు ఇప్పలపల్లి రమేష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఉప్పుతల ప్రసాద్, ఉపాధ్యాయులు కాసర్ల రమేష్, రాజేశ్వర్‌రావు, వేణు, మాధవరెడ్డి, నర్సింగరావు, లావణ్య, భూలక్ష్మి, మౌలాలి పాల్గొన్నారు.

గొల్లకురుమల సమస్యలు పరిష్కరించాలి

గోవిందరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లకురుమల సమస్యలను పరిష్కరించాలని యాదవ సంఘం మండల నాయకుడు కడారి నాగరాజుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం యాదవ సంఘం సమావేశం గరుగు ఐలయ్య అధ్యక్షతన జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయకుండా గొల్లకురు మలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చడంలేదని అన్నారు. గొర్రెల పంపిణీకి బదులు రూ.2లక్షల నగదు బదిలీపై స్పష్టత ఇవ్వాలని, జీవాలకు వచ్చే జ్వరాలు, వ్యాధులకు మందులు పంపిణీ చేయాలని, గొర్రెలకాపరులకు రూ.10 లక్షల ప్రమాదబీమా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు గొర్ల శ్రీనివాస్, భాషక కుమార్, సీతారామరాజు, దాసరి సతీష్, వరదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకోవాలని ధర్నా

గోవిందరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం మండల కార్యదర్శి సామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈసందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలపై ఆందో ళన చేస్తున్న రైతులపై ప్రభుత్వం పాశవిక దాడి చేయడాన్ని ఖండించారు. ప్రభుత్వం రైతుసంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనట్లయితే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గుండు రామస్వామి, కాప కోటేశ్వర్ రావు, గుండు లెనిన్, కృష్ణ, నాగేష్, ఐలయ్య, నిమ్మల భిక్షం, కడారి నాగరాజు, బ్రహ్మచారి, సూర్యనారాయణ, అమ్జద్, మహేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో మరణించిన లారీ డ్రైవరు ఓర్సు శ్రీనివాస్ ఉదంతంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించి సాంకేతిక సాక్ష్యాల కోసం అన్వేషించిన పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. శ్రీనివాస్ హత్యకు గురైనట్లు వెల్లడి కాగా సూత్రధారులు ఎవరనేది తేలినట్లు సమాచారం. శ్రీనివాస్ మృతి పై తల్లిదండ్రులు అను మానాలు వ్యక్తం చేస్తూ ములుగు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన సమా చారం కాల్ డేటా ఆధారంగా శ్రీనివాస్ ఇద్దరు లేదా ముగ్గురు కలిసి హత్య చేసి నట్లు పోలీసులు భావిస్తున్నారు. అతని భార్య హస్తం కూడా ఉన్నట్లు ఆధారాలు లభించినట్లు వినికిడి. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల నిమిత్తం ఠాణాలకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాల యంలో ప్రజాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధి లోని వివిధ మండలాల నుంచి 16 మంది ఫిర్యాదుదారులు రాగా వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఆ వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. భూత వివాదాలు, ఆస్తి తగా దాల విషయంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

వర్తక సంఘం అధ్యక్షుడిగా కిరణ్



గణపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ శ్రీనివాస వర్తక సంఘం అధ్యక్షుడిగా పుట్టపాక కిరణ్ ఎన్నిక య్యారు. సోమవారం చెల్పూరులోని వర్తక సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రత్యర్థి వీరమనేని శ్రీనివాస్‌కు 89 ఓట్లు పోలవగా, కిరణ్‌కు 118 ఓట్లు పోలయ్యాయని వర్తక సంఘం నాయకులు తెలిపారు. నూతన అధ్యక్షుడు కిరణ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఐతు రమేష్, అడ్డూరి శ్రీధర్‌రావు, పెండల రఘుపతి, చంద్రమౌళి, నర్సయ్య, రాజేందర్, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

కాటారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జాతీయ రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ విద్యాలయంలో రైతు దినోత్సవ వేడుకలు అలరించాయి. పలువురు విద్యార్థులు వ్యవసాయ, అనుబంధరంగాల్లో జరిగే కార్యక్రమాల ను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించారు. పలువురు రైతులను విద్యాలయ చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కాటారంలో మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, గారెపల్లిలో మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్, మాజీ సర్పంచ్ తోట రాధమ్మల ఆధ్వర్యంలో రైతుల దినోత్సవాన్ని జరిపి పలువురు రైతులను సన్మానించారు. నిర్వాహకులు కరుణాకర్‌రావు, కార్తీక్‌రావు, నాయిని శ్రీనివాస్, తోట జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు

కాటారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీదత్తాత్రేయ స్వామి ఆల యంలో సోమవారం అనఘాష్టమి పూజలు, అనఘాదేవి వ్రతం వైభ వంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, శ్రీపాదట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా వేదపండితులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్, పనకంటి ప్రవీణ్, వేదా ంతం గణేష్, ఆశీష్, సుమిత్‌పాండేలు శ్రీనుబాబు, భక్తులచే అనఘాష్టమి వ్రతం నిర్వహిం పజేశారు. విష్ణు స్వరూపుడైన అనఘుడు, లక్ష్మీదేవి స్వరూపమైన అనఘా దేవిని కొలిచే అనఘాదేవి వ్రతం లోకకల్యాణార్థం జరిపినట్లు వేదపం డితులు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసం తోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు శ్రీనుబాబు తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

మొగుళ్లపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసాయి తిరుమల బ్రాందీషాపు ముందు మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు సోమవారం మద్యంమత్తులో వీరంగం సృష్టించారు. ఫుల్లుగా మద్యం సేవించి ఆమత్తులో షాపు సిబ్బందిని అసభ్యకరంగా దర్భాషలాడుతూ ఉచితంగా మద్యం ఇవ్వాలని దురుసుగా ప్రవర్తించారు. మద్యంమత్తులో ఉన్న దేవునూరి వెంకటేష్, దేవునూరి నరేష్, వనం నాగరాజు, వనం అశోక్‌లపై బ్రాందీషాపు సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహదేవపూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర ముక్తీశ్వరస్వామి సన్నిధాన పరిసరాలను గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం శుభ్రం చేశారు. గోదావరి నదీ ఒడ్డున పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు. గోదావరి మెయిన్ ఘాట్ వద్ద విడిచిన దుస్తులు, ఇతర వ్యర్థాల కోసం పెద్ద డ్రమ్ములను ఏర్పాటు చేశారు. వీఐపీ ఘాట్లలో పారిశుధ్య పనులు నిర్వహించారు. పుష్కరఘాట్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, దుర్గంధం వెదజల్లుతోందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు ఈ మేరకు స్పందించారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తాకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమ వారం భారీ నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెం టులో చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దుపరిచి మనుస్మృతిని అమలు చేసే కుట్రలో భాగంగానే ఉన్నాయని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంఘ్‌పరివార్ చెప్పిన విధంగానే బీజేపీ పెద్దలు నడుచుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే అనుక్షణం రాజ్యాంగంపై కుట్రలు పన్నుతుందని అన్నారు. ప్రతీసారి రాజ్యాంగ నిర్మాతను అవహేళన చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా తన మాటలను వెంటనే వెనక్కితీసుకుని ప్రజలకు క్షమా పణలు చెప్పకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధు, రాజేందర్, కొంరయ్య, దేవన్, శ్రీనివాస్, సాంబమూర్తి, రవీందర్, అనిల్, రవీందర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఏసు ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యా లతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని మంజూర్‌నగర్‌లో ఉన్న కల్వరి చర్చిలో మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా పాస్టర్ రాజ్‌కుమార్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై క్రైస్తవులకు పండుగ కానుకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని మతాలకూ ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే చర్చిల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి జిల్లా కేంద్రంలో క్రిస్టియన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శైలజ, మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, నాయకులు మధు, కొంరయ్య, శ్రీనివాస్, కిషన్, రాజేందర్, కమల, పాస్టర్లు రాజవీరు, సదానందం, రాజ్‌కుమార్, కౌన్సిలర్లు రవీందర్, అనిల్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

గణపురం (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని సీతా రంపురం గ్రామంలో వన్ వర్డ్ వన్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన షటిల్ ప్రీమియర్ లీగ్ సీజన్ కార్యక్రమానికి ఆఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమ తులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్, ఉపేందర్ రావు, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రావు, సారయ్య, జంపయ్య, రామంచ భద్రయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు

రైతులను సన్మానించిన విద్యార్థులు

వెంకటాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం రైతులను శాలువాలతో సన్మానించారు. విద్యార్థులు పంట పొలాల వద్దకు వెళ్లి రైతులను సన్మానించారు. ఉపాధ్యాయులు సమ్మయ్య, ఖయ్యూం ఖాన్‌పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిట్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ సోమవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే సత్యనా రాయణరావు ప్రత్యేక చొరవతో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలుకల రాయకొంరు, గంగాధర రవీందర్, గుర్రపు తిరుపతి, అల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి : సీపీఎం

వాజేడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగు తున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నష్టపోయిన బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ డిమాండ్ చేశారు. సోమ వారం వాజేడులో జరిగిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావే శంలో ఆయన మాట్లాడారు. జగన్నాథపురం నుంచి చెరుకూ రు వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేదలు సర్వం కోల్పోయి వీధిన పడ్డారన్నారు. ఇష్టాను సారంగా ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. పెసా చట్టాలను అధికారులు అమలు చేయటం లేదని, గ్రామస భలు ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణ పనులపై అవగాహన కల్పించాలేదని ఆరోపించారు. ధనవంతులకు ఓ న్యాయం, పేదలకు ఓ న్యాయమా? అని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం మండలంలో పర్యటించ నున్నారు. మండలకేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో జరిగే డివిజన్ స్థాయి గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, డివిజన్ పాస్టర్ల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు అధికారులు, పాస్టర్ల కమిటీ ఇన్‌చార్జి ప్రభుదాస్ సోమవారం తెలిపారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహదేవపూర్ అయ్యప్ప దేవాలయంలో జరిగే పడిపూజకు మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకా నున్నారు. ఈ సందర్భంగా జరిగే పలు ప్రైవేటు, అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

మానవ హక్కుల సంఘం నేతల సందర్శన

మల్హర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్యలు సోమవారం మండలంలోని కొయ్యూర్ గ్రామాన్ని సంద ర్శించారు. మండలానికి సంబంధించిన వివిధ సమస్యలను మండల అధ్య క్షుడు వేల్పుల మహేందర్ వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వేల్పుల వెంకటేశ్, తిప్పల రజిత పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధిలో కార్మికులే కీలకం

(5వ పేజీ తరువాయి)

పోషిస్తున్న కేటీకే ఓసీ -2, ఓసీ- 3 సాంకేతిక సమస్యలతోపాటు అండర్‌గ్రౌండ్ గనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాల పనితీరు, ఇసుక కొరతతో తగినంతగా బొగ్గు ఉత్పత్తిని సాధించలేకపోయామని తెలిపారు. మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ ద్వారా అనుభవం కలిగిన కార్మికులు రిటైర్డ్ అయి, కొత్త ఉద్యోగులు రావడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోం దన్నారు. ప్రస్తుతం భూపాలపల్లి ఏరియా 74శాతం ఉత్పత్తిని సాధిం చిందని అన్నారు. రూ.269 కోట్ల నష్టాల్లో నడుస్తోందని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే బొగ్గు ఉత్పత్తి కాస్త పెరిగిందన్నారు. నష్టాలను కూడా కాస్త తగ్గించుకున్నామన్నారు. భూపాలపల్లి ఏరియాలో మరిన్ని బొగ్గు నిక్షేపాలు వెలికితీసి నిరంతర ప్రణాళికతో ముందుకు సాగు తామని అన్నారు. కార్మికుల సంక్షేమం విషయంలో సింగరేణి ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఏరియాలో ఇప్పటి వరకు 1,368 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజే శామన్నారు. అలాగే 117 మందికి లమ్‌సమ్ అమౌంట్ రూ.25 లక్షలు చెల్లించామని, నెలవారీ భృతి(ఎంఎంసీ) 33 మందికి అందిం చామ న్నారు. రిటైర్డ్ కార్మికులు 3,069 మందికి మెడికల్ కార్డులను అందించామన్నారు. సింగరేణి సేవా సమితి ద్వారా ప్రభావిత ప్రాంత ప్రజలతో పాటు నిరుద్యోగ యువతకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. బదిలీ వర్కర్లు ఐదేళ్లపాటు అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా జీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్యోతి, కవీంద్ర, వెంకట్రామిరెడ్డి, సురేఖ, పద్మజ, మారుతి, జాకీర్‌హుస్సేన్, కృష్ణప్రసాద్, నజీర్, రాజు, క్రాంతి, సాయికృష్ణ, శ్రావణ్‌కుమార్, కిషోర్, దీప తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్ డెమోను ప్రదర్శిస్తున్న మహిళా కార్మికులు

ఆకట్టుకున్న స్టాల్స్.. సాంస్కృతిక ప్రదర్శనలు

సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా అంబేద్కర్ క్రీడా మైదానంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2 అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గనిలో పనిచేసే లోడర్ల టైర్లు, యంత్రాల పనిముట్లను ప్రదర్శించారు. సంస్థ లక్ష్యాలు, సాధించిన విజయాలను తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఓసీ-2లో పనిచేసే మహిళా జనరల్ మజ్దూర్లు ఐదుగురు సీపీఆర్‌పై డెమోస్ట్రేషన్ ఇచ్చి ఆకట్టుకున్నారు. చిన్నారులు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా ఇటీవ నిర్వహించిన క్రీడల్లో విజయం సాధించిన వారికి జీఎం బహుమతులను ప్రదానం చేశారు.